ఈ వారం కథ

# ఈ కథకు ముగింపేది?

## డాక్టర్ ఎం.సుగుణరావు

గంగాధరం తన కెదురుగా కూర్చున్న కిరీటిరావు వంక పరిశీలనగా చూశాడు. తెల్లగా, పొడుగ్గా చెంపలమీద మెరుస్తున్న జుట్టు, కళ్ళకు రేబాన్ గ్లాసెస్– గోధుమరంగు సఫారీ డ్రెస్, ముఖంలో నమ్రత... ఆచితూచి మాట్లాడే స్వభావం... అతనో జిల్లాస్థాయి అధికారిలా కాక, బిజినెస్ మాగ్నెట్‌లా కనిపించాడు గంగాధరం కళ్ళకు...అరగంటనించీ వాళ్ళిద్దరి మధ్యా సంభాషణలు సాగుతున్నాయి. అతడికి తెలీకుండా గంగాధరం తనకు కావలసిన సమాచారం రాబట్టుకుంటున్నాడు. తనలో మెదిలే భావాలను జాగ్రత్తగా అణచిపెట్టి వుంచాడు. ఐదునిమిషాల తర్వాత వారి సంభాషణ ఆగిపోయింది.

ఇక మాటలకేమీ దొరకనట్లు మౌనం వహించాడు కిరీటిరావు. మరయితే మీరు తొందరలో వున్నట్టున్నారు.. తర్వాత నేనే వచ్చి కలుస్తాను.. అన్నాడు గంగాధరం ముక్తాయింపుగా. కరచాలనం చేసి వెనుతిరిగాడు కిరీటిరావు. మెట్లు దిగుతున్న చప్పుడు. ఐదు నిమిషాలకు కిరీటిరావు జీపు కదిలింది. గంగాధరం కిరీటిరావు పర్సనల్ ఫైలు చేతిలోకి తీసుకున్నాడు. అతని కళ్ళు వేగంగా కదులుతున్నాయి.... ఆలోచిస్తూ ఫైలు చదువుతున్నాడు. ఇంకో రెండు నెలల్లో డిప్యూటీ సెక్రటరీగా ప్రమోట్ కాబోతున్నాడు. ఈ కంప్లయింట్‌తో అతడి భవిష్యత్తు ఎలా మారనున్నదో?! అనుకున్నాడు. ఒక ఆకాశరామన్న ఉత్తరంతో తనను ఎంక్వయరీ ఆఫీసరుగా వేశారు. ఇరవయ్యేళ్ళుగా బయటకు రాని నిజం ఇప్పుడు బయల్పడుతోంది. దాన్ని తను వెలికితీయాలంటే సాక్ష్యాలు కావాలి. అందుకు తను కృషి చెయ్యాలి. అది తన ఉద్యోగ ధర్మం... అనుకున్నాడు గంగాధరం. అలా అనుకోగానే ఆలోచనల్లోంచి తేరుకుని ఆర్టీసి కాంప్లెక్స్‌కు ఫోన్ చేశాడు. కేతవరపు పాలెం ఎలావెళ్ళాలి అని? గుంటూరు నుంచి రెండుగంటల ప్రయాణం. అవతలి నించి సమాధానం వచ్చింది. ఆ వూరు కిరీటిరావు స్వస్థలం. ఆవూరి సర్పంచ్ అయిన ఆయన బాబాయ్ చూస్తున్నాడు అతడి పొలాలు. ఈ వివాదాలు కిరీటిరావుతో మాట్లాడుతూ తెలుసుకున్నాడు. అతడి బాబాయ్‌ని కలిస్తే మరికొన్ని వివరాలు తెలుస్తాయని గంగాధరంకు అర్ధమయింది. తను ఇంటికి రావడంలేదని ఫోన్‌చేసి జీపులో బయలుదేరాడు. ఇరవయ్యేళ్ళుగా ఎవరికీ అనుమానం రాలేదు, ఇప్పుడు తను ఎంక్వయిరీ చెయ్యాలి.... ఇంతకీ కిరీటిరావు చేసిందేమిటి?... ఇలా ప్రయాణిస్తున్నంతసేపు అవే ఆలోచనలు. కిరీటిరావు దొంగతనం చేశాడా?! కాదు, హత్యా? అదీకాదు. మరతను చేసిందేమిటి? తనదికాని కులాన్ని తగిలించుకొని అంచెలంచెలుగా పైకెదిగాడు. ఇంకో వ్యక్తికి రావలసిన అవకాశాన్ని తను కొట్టేశాడు. ఇరవయ్యేళ్ళ క్రితం గుమస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించి, జిల్లాస్థాయి అధికారిగా ఎదిగి, ఇప్పుడు డిప్యూటీ సెక్రటరీగా పదవి స్వీకరించబోతున్నాడు. మొగాడ్! ప్రభుత్వానికి తెలియకుండా ఎంత తెలివిగా నాటక మాడేడు.... గంగాధరంలో ఆలోచనలు వదలకుండా ముసురుకుంటున్నాయి. కిరీటిరావు మీద ఆకాశరామన్న ఉత్తరం... నకిలీ కుల ధృవీకరణ పత్రంతో ఉద్యోగంలో జాయినయ్యాడని... ఎంక్వయిరీ జరిపించాలని. ఆ ఉత్తరం ఎవరు రాశారో? బాగా తెలిసిన వాళ్ళై వుండాలి...! ఏ ఫలాపేక్ష లేకుండా ఎందుకు రాస్తారు? ఇది పోటీ ప్రపంచం. కిరీటిరావుకు పోటీగా రంగంలో మరో ముగ్గురున్నారు.... ఆ నలుగురిలో కిరీటిరావు సీనియర్ ... అతడినే పోస్టు వరిస్తుంది.... అతడిని తప్పిస్తే తమకే వస్తుందని బురద జల్లడానికి ఇలా ఉత్తరం రాశారా... అనే అనుమానం కూడా కలిగింది గంగాధరానికి మొదట్లో. అయితే కిరీటిరావు పర్సనల్ ఫైలులోని అతడి ఇంటి పేరు, ఊరి పేరు... మొదలైన వివరాలు చదివేసరికి అతను నకిలీ వేషం వేశాడనిపిస్తోంది... ఇప్పుడు అతని స్వంత ఊరు వెళుతున్నాడు కాబట్టి సమాచారం పూర్తిగా దొరకొచ్చు అనుకున్నాడు.... జీపు వెళుతోంది.... నిశ్చలంగా చూస్తున్నాడు ప్రకృతికేసి... చెట్లు... చేమలు...కొండలు కదిలిపోతున్నాయి. మనుషులు కదిలిపోతున్నారు.... నిజానికి వాటిలో చలనం లేదు. అంతా భ్రమ... నిజంగా భ్రమల్లోనే బ్రతుకుతున్నాడు మనిషి పుట్టడం... పెరగడం... పెళ్ళి ... సంసారం... చావు...– ఇదంతా ఒట్టి మాయేనా.... అయినా తెలిసి తెలిసి మనిషిలో ఎందుకో ఈ ఆరాటం.... తన మనసుని మోసంచేసి



తోటి మనుషుల్ని మోసంచేసి... ప్రభుత్వం కళ్ళు కప్పి.... చివరకి సాధించేదేమిటో... పిడికెడు బూడిద... ఇవుడు తవేం సాధిద్దామని బయలుదేరాడు.. ప్చ్... ఇదేమిటో వైరాగ్యం... అది తన డ్యూటీ... ఎవరివని వాళ్లు చెయ్యాలి కదా... తనలో తాను నవ్వుకున్నాడు. గుంటూరొచ్చింది. అప్పటికే మధ్యాహ్నం రెండయ్యింది. డ్రైవరు, గంగాధరం భోంచేశారు... మళ్ళీ ప్రయాణం... మధ్యాహ్నం నాలుగయింది కేశవపాలెం చేరుకునేసరికి. ఆ ఊరు పట్టణపు పోకడలు సంతరించుకుంటున్న పల్లెటూరు. ఆ ఊరి సర్పంచ్ పేరు రామారావు. కిరీటిరావుకి బాబాయ్ అవుతాడాయన. ఊరు చేరగానే ముందుగా ఆయనింటికే వెళ్ళాడు. పొడుగ్గా, సన్నగా వున్నాడు. చామనచాయి. వంపుతిరిగిన మీసాలు. "అయ్యా మీదే డిపార్ట్‌మెంట్" అనడిగేడాయన. తన డిపార్ట్‌మెంట్ పేరు చెప్పకుండా మాతులు శాంక్షన్ చేసే అధికారిగా తనను పరిచయం చేసుకున్నాడు. ఆయనే ముందుచెప్పాడు తన అన్న కొడుకు కిరీటిరావు పెద్ద ఆఫీసరు పోస్టులో వున్నాడని. ఏమీ తెలియనట్లు తాను ఊకొట్టాడు... ఆయన అంత పెద్ద పోస్టులో వున్నా మాకేమీ లాభం లేదండీ... మా మనవడికి ఉద్యోగం వేయించలేకపోయాడు.... ఈ రోజులలో మా వాళ్లకు ఉద్యోగాలేం దొరుకుతున్నాయి... ఆయన చెప్పకుపోతున్నాడు.... ఆ మాటల్లోని నిగూఢార్థం... గంగాధరానికి తెలిసింది... మరి కొంతసేపు ఆయనతో సంభాషించేసరికి గంగాధరానికి చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది. కిరీటిరావు వేసుకున్న ముసుగు గురించి ఎవరికీ తెలీలేదు. కనీసం బంధువులకు కూడా తెలీకుండా ఎలా మేనేజ్ చెయ్యగలిగాడో అనుకున్నాడు. ఆయనతో అరగంటసేపు మాట్లాడి జీప్ ఎక్కబోతుంటే ఒక కాగితం మీద రెండుపేర్లు రాసిచ్చాడు... వీళ్ళిద్దరికీ మాతులు సాంక్షన్ చెయ్యాలి. వీళ్ళు మా పాలేర్లు... వీళ్ళకొస్తే నాకొచ్చినట్లే... ఎలాగూ నాకివ్వరుగా మీరు అంటూ నవ్వేడు...


గంగాధరానికి తనొచ్చిన పని పూర్తయింది. అతడి ఆఖరి మాటలకు తన ఎంక్వయిరీలో కిరీటిరావు దోషిగా తేలిపోయాడు. ఆ తర్వాత మండల

## జగన్నాధ లీలలు

అతడు రథచక్రాలను మార్చుతుంటాడు!
అతడు అతడి రథానికి అర్జునుల్నీ మార్చుతుంటాడు!
కర్ణుల కవచాలు ఒలుస్తుంటాడు!

అతడు అతడి రథానికి గుర్రాలను కూడా మార్చుతుంటాడు!
మోసాని గుర్రానికి మోసం తెలిసేలోపే
పాపం ముసలిదై పోతుంది!
'పైపాకు కొరగానిదవుతుంది'...!

—మెన్నం సత్యం



రెవిన్యూ ఆఫీసుకెళ్ళి మరికొన్ని వివరాలు సేకరించాడు. మొత్తానికి బలమైన సాక్ష్యాలు లభించాయి. వచ్చిన పనయిపోయినందుకు సంతృప్తిగా జీప్ ఎక్కాడు.

మరో వారంరోజుల పాటు కిరీటిరావు ఉద్యోగంలో జాయినయిన రోజు లగాయితు నేటివరకు లభించిన అతని సర్వీసు రికార్డులు పరిశీలించాడు. ఇక ఎంక్వయిరీ పూర్తయ్యింది. రిపోర్టు తయారు చెయ్యాల్సి వుంది. ఒక పక్క కిరీటిరావు చేసింది నేరమైనా, మరో పక్క అతడిని చూసి జాలి కలుగుతోంది. దీని ఫలితం ఎలా వుంటుంది? అతడి భవిష్యత్తు ఏమవుతుంది? వంటి ప్రశ్నలు అతడిలో తలెత్తాయి. కిరీటిరావు గురించి ఎందుకంత తీవ్రంగా ఆలోచిస్తున్నాడంటే అతడు ఉద్యోగంలో చేరింది లగాయితు ఎవరితోనూ వేలెత్తి చూపించుకునే పనేమీ చెయ్యలేదు. 'మిస్టర్ క్లీన్'గా చెప్పుకుంటారు కిరీటిరావు గురించి. వర్క్‌హాలిక్‌గా పేరుంది. రెండుసార్లు స్టేట్ అవార్డు వచ్చింది. ఈ కారణాలన్నీ ప్లస్ పాయింట్లయితే ప్రభుత్వాన్ని మోసం చెయ్యడం మాత్రం వీటన్నిటినీ త్రోసి రాజంటోంది. ప్చ్... లాభం లేదు.... అనుకున్నాడు. తను తయారుచేసిన రిపోర్టు ప్రభుత్వానికిస్తే అతనిమీద కోర్టులో కేసు వేస్తారు. ఉద్యోగంలోంచి తీసివెయ్యడంతోపాటు జైలుశిక్ష కూడా పడొచ్చు.... వేనోళ్ళ అతనిని అభినందించినవాళ్ళే అభిశంసిస్తారు... అంతే! అనుకున్నాడు.

తరువాత రోజు గంగాధరాన్ని ఆశ్చర్యపరుస్తూ ఒక వార్త. కిరీటిరావుకు హార్ట్ ఎటాక రావడంతో హాస్పిటల్‌లో జాయినయ్యాడట. అతడిమీద తను చేస్తున్న ఎంక్వయిరీ రహస్యంగానే సాగుతోంది. దాదాపు పూర్తయినా... కిరీటిరావుకు సీరియస్‌గా వుందని తెలియడంతో తను రాయాల్సిన రిపోర్టుముందుకు సాగలేదు. ఒకసారి కిరీటిరావును చూసిరావాలనుకున్నాడు. హాస్పటల్‌కు బయలుదేరాడు. తను అతనిమీద చేస్తున్న ఎంక్వయిరీ గురించి ఈపాటికి తెలిసే వుంటుంది. గంగాధరంలో ఏదో గిల్టీకాన్షస్‌నెస్.. తన మూలంగానే అతను జబ్బుపడ్డాడా!? మనసును తొలిచే ప్రశ్న.. అంతలోనే సమాధానపడ్డాడు. అందుకు తనే కారణమయితే తనేం చేయగలడు!? తన డ్యూటీ తాను చేస్తున్నాడు. ఇందులో తన తప్పు లేదు, తనది దోషమూ కాదు. అలా ఆలోచిస్తూనే జీపులోంచి దిగాడు. హాస్పిటల్ గేటు దగ్గర కిరీటిరావు పియ్యే ఎదురుపడ్డాడు.. తన వంక అదోలా చూస్తూ... "సార్‌కు ఎలా వుంది?" "పరిస్థితి బాగా లేదండి. ఉద్రేగం కలిగించే మాటలు మాట్లాడొద్దన్నారు.. ఎవరం కలవడం లేదు.. బయటినుంచే చూసొచ్చేస్తున్నాము..." ఈ మాటలు తనకెందుకు ప్రత్యేకంగా చెబుతున్నట్టు.. తనని చూసి మరోసారి హార్ట్ ఎటాక్ తెచ్చుకుంటాడనా.. మైగాడ్.. తను వెళ్ళకపోవడమే మంచిది.. "సర్లెండి ఆయనకు తగ్గింతర్వాత వస్తాను చూడడానికి.." ఆ మాటలు గబగబా చెప్పి వెనక్కి తిరిగి చూడకుండా జీప్ ఎక్కాడు.

* * *

కిరీటిరావు చూడ్డానికి వెళ్లిన రెండు రోజులకు సెంట్రల్ ఆఫీసునుంచి టెలెక్స్ మెసేజి. వెంటనే ఎంక్వయిరీ రిపోర్టు పంపమని. గంగాధరంలో ఏదో అంతస్సంఘర్షణ... చావుబతుకుల్లో వున్న వ్యక్తిమీద రిపోర్టు రాయడానికి ఏమాత్రం కలం ముందుకు సాగడం లేదు... ఇప్పటికే తను ఆలస్యం చేశాడు.. ఎలాగోలా రాయాలి. తప్పదు మరి.. అలా నిశ్చల మనస్కుడై రిపోర్టు తయారుచేశాడు. చాలా బలమైన సాక్ష్యాధారాలతో కిరీటిరావును దోషిగా నిలిపే రిపోర్టు. దాన్ని ఇంక రిలీజ్ చెయ్యాలనుకున్నాడు. ఇంతలో అతడు ఊహించని మరో చేదు వార్త. కిరీటిరావుకు తీవ్రమైన గుండెనొప్పి వచ్చి కోమాలోకి వెళ్ళి నిద్రలోనే చనిపోయాడట!?

గంగాధరం గుండెలు బరువెక్కాయి. తను వారం క్రితం చూసిన మనిషి కళ్ళముందునుంచే కదిలిపోయాడు. ఇప్పుడు తను రిపోర్టు విడుదల చేయాల్సిన పని లేదు. ఎవరికి వేస్తుంది ప్రభుత్వం శిక్ష!? తనిపుడు రిపోర్టు రిలీజు చేయాల్సిన అవసరం వుందా? అతడికి ప్రత్యర్థులెవరూ లేరు. పోటీరంగం నుంచి శాశ్వతంగా తప్పుకున్నాడు అనుకుని గంగాధరం బాధపడ్డాడు. రెండు రోజులకు గంగాధరానికి ఒక సీల్డ్ కవర్ అందింది.



## మిలట్రీ డిసిప్లిన్

పెరేడ్‌కు సిద్ధమైన
సైనికుల్లా చేలో బారులు
నిలువగా–అడ్డంగా–వరసలుగా

చీకటిలో నిలబడి నిద్రిస్తున్నంతలో
తుపాన్ దుర్మార్గపు ఆకస్మిక దాడి
సైనికులు సగానికి తెగిపడ్డారు క్షణంలో
'మరణంలోనూ సైనిక క్రమశిక్షణే'
అన్నీ ఒకే వైపుకు

ప్రక్కన దిగాలుగా నిలిచిన
వరుసల్లోని చిట్టి చిట్టి వారసులకు
అంతిమ సందేశమైనా ఇవ్వని
అరటితోటలు

–లలితానంద్

చింపి చదివాడు. చెప్పలేని ఆశ్చర్యంతోపాటు గుండెలు పిండేసినట్టుగా ఫీలింగ్.

అది కిరీటిరావు తనకు రాసిన ఉత్తరం. అతడి ఫేమిలీ డాక్టరుద్వారా అందజేయబడింది. ఉత్తరం ని అక్షరాల వెంట అతడి కళ్ళు పరుగుతీశాయి.

"–అయ్యా!

నామీద ఎంక్వయిరీ నడుస్తోందని తెలుసు. నాకు తెలీదనే మీరను కున్నారు. నా ఇరవయ్యేళ్ళ సర్వీసులో నాకున్న అనుభవంతో మీరు చేస్తున్నదేమిటో అర్థమయింది. అందుకే ఆందోళన ఎక్కువై హార్ట్ ఎటాక్ వచ్చింది. ఇది రెండోసారి రావడం. పోతానేమోనని భయం పట్టుకుంది. అందుకే– ముందుగా ఉత్తరం రాసి మా ఫేమిలీ డాక్టరుగారికి అందజేశాను మీకిమ్మని. ఔను.. మీరు నిర్ధారిస్తున్నట్టుగా నేను ప్రభుత్వాన్ని మోసమే చేశాను. అందుకు తగిన శిక్ష ఇరవయ్యేళ్ళుగా అనుభవిస్తున్నాను. రిజర్వేషను వుంటే ఏదో ఉన్నత శిఖరాలకు ఎగబ్రాకవచ్చుననే అపోహ వుంటుందేమో కాని నిరంతరం మానసికంగా కుమిలిపోయే స్థితి కల్పించబడుతుంది. తోటి సహచరులు, చాటుగా, బాహాటంగా ముఖంమీదే ఈటెల్లాంటి మాటలు... అసూయ, విద్వేషం.. వీటితో చస్తూ బతకాలి. కలిసినట్టే కలిసి దూరంగా వుంచే మనుషుల మధ్య రిజర్వేషను కలిగివుండడం పూలపాన్పు కాదు... ముళ్ళబాటే.. మనిషిని చంపితే శిక్ష వుంది.. మరి మనసును చంపితే ఏ చట్టమూ శిక్ష వెయ్యదు.. నేను కల్పించుకున్న ఈ రిజర్వేషన్‌తో ఇంతటి అంతర్మథనం అనుభవించాను.. అదే.. జన్మతహా ఆ వర్గంలో పుట్టిన సోదరుల పరిస్థితి ఏమిటో! ఇది నిజంగా అనుభవిస్తేనే తెలుస్తుంది.. వచ్చే జన్మంటూ వుంటే నేను భగవంతుణ్ణి ప్రార్థించేది ఒక్కటే, నన్ను రిజర్వేషన్ కాండిడేటుగా మాత్రం పుట్టించొద్దని.." గంగాధరం మరి చదవలేకపో యాడు.. అతడి కళ్ళనుంచి అశ్రుధారలు ధారాపాతంగా... ఔను మరి అలాంటి బాధ గురించి అతడికీ తెలుసు.. అది అతడు అనుభవిస్తున్నదే!?


రూ. 1,00,000/
విలువగల బహుమతులు
గెలుపొందండి



**1 వ బహుమతి:** డెల్‌సన్ కలర్ టి.వి. (లేదా) హీరోహోండా మోటార్‌సైకిల్
**2 వ బహుమతి:** ఎం.బి.ఎస్. క్రింద 36" కలర్ టి.వి. (లేదా) స్టీరియో డెక్
**3 వ బహుమతి:** 10 గ్రాముల బంగారు ఆభరణముల సెట్
**కన్సొలేషన్ బహుమతులు:** ఎం.బి. పథకము క్రింద ఎ.సి./డి.సి. ట్రాన్సిస్టర్ సెట్స్/ క్వార్ట్జ్ రిస్ట్‌వాచెస్/ కలర్ ఫొటోగ్రాఫిక్ కెమెరా
**ఈ ప్రశ్నలకు సమాధానాలను 7 రోజులలోగా పోస్ట్‌కార్డ్‌పై వ్రాసి పంపండి. ఒక కుటుంబం ఒక్క ఎంట్రీని మాత్రమే పంపాలి.**

1. భారతదేశంలో ఓటుహక్కు వయస్సు: ______ (21 / 18 సం.లు)
2. తాజ్‌మహల్ ______ వద్ద గలదు. (హైదరాబాద్/ ఆగ్రా)
3. భారతదేశంలో అతి ప్రాముఖ్యంగల మత ప్రదేశం: ______ (తిరుపతి/ వైష్ణదేవి)
4. స్వతంత్ర భారతావనికి ప్రథమ ప్రధానమంత్రి: ______ (ఇందిరాగాంధీ/ జవహర్‌లాల్ నెహ్రూ)

Send your entry to :
**DELSON AGENCY (W-83)**
K.V. Vihar, Main Road, Delhi-110094